

# వనజాక్షి వస్త్రాపహరణం

బలివాడ కాంతారావు

అసలు యిలాంటి సంఘటన మన భారతేతిహాసంలో జరిగింది. అప్పటినించీ యిప్పటివరకు యీ దేశంలో యిలాంటి సంఘటనలు జరుగుతున్నాయనటానికి నిదర్శనంగా ఆ మధ్య జరిగిన యీ సంఘటనను మీ ముందు పెట్టున్నాను.

ఆ వూరు పల్లెకంటె పెద్దది. పట్నంకంటె చిన్నది. ఆ వూరు యీ విశాల భారతావనిలో యే పేరుతో యే మూలనున్నా అందులో నివసించే జనం భారతీయులే. ఆ వూర్లోకి వనజాక్షి పెద్ద కోడలుగా వచ్చింది. ఆమె పెద్ద పట్నంలో పెద్ద యింట పుట్టి పెద్దగా పెరిగింది. ఆడ మొగ మధ్య అనురాగాలను ఒకే దృష్టితో చూడటం ఆమెకు అలవాటు లేదు అలంకరించుకోవటం, ఆశలల్లుకోవటంలాంటివే ఆమెకు. పాలిపోయిన అలంకరణ, జారిపోయిన ఆశలకు మళ్లీ మెరుగులు దిద్దుకోవటం అలవాటే. అందానికి ఆహారం వుంటేనే బ్రతుకుతుందన్న తత్వం ఆమెది. పై మగవాడు పలకరిస్తే ముఖం ముడుచుకోదు; ముక్తసరిగా జవాబివ్వదు. వాడి బుర్రలో యెంత సత్తా వుందో పరీక్షించి మరీ, వీలైతే ఓడించి మరీ విడిచి పెట్టుంది.

అలాంటి వనజాక్షి యీ పల్లెకాని పల్లె, పట్నంకాని పట్నంలోనికి కాపరానికి వచ్చేటప్పటికి పరిస్థితులివి.

1. భర్త ఒక పెద్ద కుటుంబంకు పెద్ద. అతని వయసు తక్కువైనా జుత్తు సగం నెరిసింది. కారణం తండ్రి వదిలిన బాధ్యతలను నెత్తిమీద వేసుకోవటం మూలంగా. తను పెళ్లి చేసుకోకుండా ముగ్గురు తమ్ముళ్లా, నలుగురు చెల్లెళ్లకు పెళ్లి చేసాడు. ఇంకొక యిద్దరు చెల్లెళ్లు పెళ్లికున్నారు.

2. అతని వ్యవహార దక్షతకు ముచ్చటపడింది. ఆకాశం నెత్తినపడ్డా యీ మొగాడు చెల్లించడనుకుంది. ఇంట్లో ఆడబడుచులూ యెవరైనా వస్తే తలుపులు వేసుకుని సందునుంచి తొంగి చూడటం ఆమెకు నచ్చలేదు.

3 ఏ విషయంలోనూ వుదారత కనిపించలేదు. వనజాక్షి చేస్తున్న ప్రతిపనీ మూతి విరుపులకు; ప్రతిమాట హేళనకు

# వనజాక్షి...

దారి తీస్తుండేది. ఆ పనేదో చాటు మాటుగా జరిగేది. ఒక వేళ యెదురుగా వున్న మరిది చెంగయ్య, 'వదినా' అని నోటి నిండుగా పిలిస్తే 'ఏం మరిదీ' అని ఈమె కూడా అలాగే పలుకరిస్తే ఇంట్లో అత్తగారి దగ్గర నుంచి తోటికోడళ్ళందరికీ కోపమే వాడు మంచివాడు కాదంటారు 'వాడి చెడ్డగేదో నాకు అర్థం కాకుండా వాడ్ని చెడ్డవాడనటం యిష్టంలేదు.' అనేది. ఉన్న ఒకే సినిమాహాల్లో మర్యాదకు అటు భర్త, యిటు చంగయ్య మధ్య కూర్చుంటే హాలు హాలంతా వెను తిరిగి చూసింది.

మొగుడు అందగాడు కాడు. ఆమెకు అందంతో పనిలేనట్లే వుంది. మూడు రోజుల్లో మొగుడే ఈ ఆడదానిలో తన కంటే యేదో గొప్ప వ్యక్తిత్వం వుందని పసిగట్టేశాడు. ఉద్యోగం చెయ్యనంత మాత్రాన కార్యదక్షత లేదని కాదు. అతను ఒక బి. య్యే కానీ, వ్యవసాయం చేస్తున్నాడు. దానికితోడు తండ్రి వదలిన బట్టల వ్యాపారం చూస్తున్నాడు. ఎంత చేసినా నిందలూ, నిష్ఠూరాలూ, తిట్లు. ఒకోసారి విసుక్కుంటున్న, ఈ మగాడికి చెప్పుకోడానికి యిల్లాలు దొరికింది. మొదట పట్నం పిల్లనా అన్నవాడు తన చెల్లెళ్ళకూ ఈమెకు మనిషిగావున్న తేడాను గమనిస్తూనే వున్నాడు.

ఆరునెలలు గడిచేసరికి అతని ముఖంలో కొత్త కాంతి. అతని మనసులో కొత్త వూహలను చొప్పించింది వనజాక్షి. చీకటిలో వెలుగుకోసం స్విచ్ వేసినట్లే, బాధలో ఆమె ప్రేమ చూస్తేసరి ఆ చిరునగవు అతనిలో ఆశాభావాలను వెలిగిస్తుంది. తమ్మారావు తనువంతా వనజాక్షి పరమై పోయింది.

ఒకనాడు ఆకాశం నిర్మలంగా వున్నరోజు. అందులో నిండు జాబిలి వెన్నెలను వెద జల్లుతున్న ఆరోజు. కలువభామ రెక్కలు విప్పి నిదానంగా చంద్రుణివేపు చూసి నట్లు వనజాక్షి మొగుడివేపు చూసింది. ఈ బరువోధిలో ప్రణయయాత్ర చెయ్యవలసిన ఈ సమయంలో ఆమె ప్రేమ పలుకులు వొలకబొయ్యలేదు. కానీ ప్రేమ నిండిన ఆడదిగా మాట్లాడింది.

'నేను సుఖంగా వున్నానా లేదా అని ఒకసారైనా అడగలేదేమండీ?' అంది.

తమ్మారావు తెలివి తెచ్చుకున్నట్లు నోరు ఆవులించాడు. ఆమె ఒక క్షణం ఆగింది.

'ఇంత చలాకీగావుంది కాబట్టి సుఖం గానే వుందనుకున్నారు. అంతేనా?'

తమ్మారావు తలవూపాడు.

'నా కార్యదక్షత నా వున్నతికే వినియోగించుకుంటే నాకు చివరికి మిగిలేదేమిటి?'

'తృప్తి' అన్నాడు.

ాయి – బుగ్గ

కొద్ది క్షణాలు మౌనంలో యేదో పిట్ట ఒంటిగా అరుచుకుంటూ యెగురుతోంది. తలెత్తి చూసేసరికి ఒక నల్లని మబ్బు తునక, ముక్కలుగా విడిపోయి కదిలి పోతోంది.

'నేననేది మీ కార్యదక్షత యితరుల బాగుకోసం కూడా వాడాలని, మీకు యింత వరకూ తట్టలేదా?'

'ఇదివరకు ఆలోచించాను. కొందరు కోరారు కూడాను. నేను రాజకీయాల్లో దిగాలి. దిగితే, నా ఆంతరంగిక జీవితం అనవసరంగా నిందలపాలవుతుంది. భూతద్దాలతో చూసి అతిశయోక్తులతో నింపుతారు సుఖంగానున్న జీవితాన్ని కష్టాల లోనికి దింపమని యెవరు చెప్పారు?'

ఆమె చిన్నసవ్వునవ్వి.

'ఈ లోకం గుర్తింపబడటానికి కొంత సాహసం కావాలి మరి.'

'ఈ యింట్లో ఈ బరువంతా యెవరు మోస్తారు?'


'అయితే యేడాదినాటినా యింకా నా కార్యదక్షతమీద మీకు నమ్మకం కుదర లేదన్నమాట'

తమ్మారావు కూర్చున్నవాడు చప్పున లేచిపోయి ఆమెదగ్గర నిల్చుని తల నిమురుతూ,

'ఎక్కడనించి దిగివచ్చింది దేవత! నడు – నీ చేతనున్న వెలుగుతున్న దివిటీతో దారి చూపిస్తే నేను...'

ఇంక అతనికి మాటలు రాలేదు. ఆమె ఈ ఆవేశంతో ఆవులించిన నోటిలో చెయ్యిపెట్టలేదు, పెదిమలు అందించి అమృతం పోసింది.

ఇంటి బాధ్యతలు వనజాక్షి నెత్తిన వేసు కోవటంతో అంతా విడ్డూరంగా చూసారు. ఆమెకు తోచింది చెయ్యటానికి భర్త కాదనలేదు. కానీ తోటికోడళ్ళు, ఆడ బడుచులు, అత్తగారు పరోక్షంగా అడ్డు తగిలినా ఆమె పట్టించుకోలేదు. ఏదో ఒక లక్ష్యం పెట్టుకున్న మనిషికి ఆవేశం పూని, అడ్డంకలను లెక్కచెయ్యకుండా పరిగెత్తింది. ఆమె లక్ష్యం యింటి బాధ్యతతో భర్తకాలం వ్యర్థపడకుండా చూడాలి. అతను ప్రజల్లో తిరిగి వారి కష్టసుఖాలు తెలుసుకోవాలి. అందులో



భాగం పంచుకోవాలి. అనుభవించటమే అర్థం కాదన్న తత్వం ఆమెది ఎగిరే పిట్ట గాలి వానలో గూటిలో వుంటుందిగానీ గాలిలో వుండదు. తన భర్తకు అవసరమైతే గాలి వానలో కదిలే గుండె నిబ్బరం రావాలి అతను విజాయితీపరుడు విజాయితీ అందమైతే దానికి తగిన అలంకరణ లుండాలి విజాయితీ ఒకరి జీవితంలో వచ్చని పూలతోటైతే దానిని రక్షించే కంచ కావాలి. ఆ అలంకరణ. ఆ కంచె అతని కార్యదక్షత ఆ దక్షత గుండె నిబ్బరం వల్లనే వస్తుంది.

ఎక్కడకు చేరాలో యెలా చేరాలో నిర్ణయించుకున్నవాళ్లకు కష్టాలు అడ్డంకులు యెదురుపడ్డా వెనకకు తిరిగిపోరు ఇంట్లో ఆమె నేనే పెద్దనన్నట్లు వ్యవహరించింది. ఇంట్లో పరిసరాలు మార్పుగలిగిందేగానీ, బూజుపట్టిన ఇంటిలోని మనుషుల మనసులు తుడవలేకపోయింది. భర్తకు అండదండగా నిల్చింది ఆమె ఆలిగానే కాకుండా, మంత్రిగా వ్యవహరించింది. వొరిగిననాడు చేయూత నిచ్చింది నిటారుగా నిల్చున్ననాడు ప్రక్కకు తప్పుకుంది. రాజకీయాల్లో రంకు బొంకులకు తావివ్వకుండా తమ్మారావు మెసలుతున్నాడు.

ఒక వేపు వనజాక్షి అండగా నిల్చుంటే, రెండో వేపు చెంగయ్య వున్నాడు. వాళ్లిద్దరూ అంత అన్యోన్యంగా వుండడానికి అవకాశం యిచ్చింది వనజాక్షి. చంగయ్య అప్పటికి చిన్నవాడైనా రాజకీయాల్లో ఆరితేరి వున్నాడు అతని సహాయం కొంతలో కొంత వుండబట్టే తమ్మారావు చుట్టూ ఆ పక్షులు వేగంగా చేరాయి.

తమ్మారావు కొద్ది కాలంలో ఛైర్మన్ గద్దెమీద కూర్చున్నాడు. చంగయ్య యింట్లో మనిషిగా వున్నాడు. ఇద్దరూ ఆలోచించుకునే యే పనైనా చేసేవారు. వనజాక్షిని సలహాలు అడుగుతూండేవారు వనజాక్షి, చంగయ్య ఒకరినొకరు యేనాడూ అనుమానించుకోలేదు పైకి అలా అనుకోటానికి ఎలాంటి అవకాశమూ రాలేదు. అతని మాటల్లో 'వదినా' అన్న ఆప్యాయత, ఆమె నవ్వుతూ 'మరిది' అన్న జవాబుకు పెడార్థాలు ఆమె వినదల్చుకోలేదు.

నీలి కొండల్లో దాగున్న అగ్ని పర్వతం ఒక్కసారి పేలిపోయింది. ఇలా వస్తుందని

తల్లినుండి పిల్లకు పారంపర్యా వుడ్‌వార్డ్స్' వార్త వాడుకగా వస్తోంది

మీ శిశువును

వుడ్‌వార్డ్స్

గ్రైప్ వాటర్‌తో

ఆరోగ్యంగాను, ఆనందంగాను వుంచండి

తరతరాలనుంచి తెలివైన తల్లులు తమ శిశువులకు వుడ్‌వార్డ్స్' గ్రైప్ వాటర్‌ను వాడియున్నారు. వుడ్‌వార్డ్స్' కడుపులో కుట్టు నొప్పి, పైత్యం, వాయువు మరియు పళ్ల వచ్చునప్పటి జబ్బులు, ఈ బాధల నుండి తక్షణ విముక్తి కలిగిస్తుంది.






సురక్షితంగా వుండండి.
నిబ్బరంగా వుండండి.
సర్వదా ఒక సీసాను
దగ్గిరుంచుకోండి.

వుడ్‌వార్డ్స్' గ్రైప్ వాటర్
తెలివైన తల్లులు
వంద ఏళ్లకు మించి
వాడుచున్నారు.

AT 30 TL

ఉదాహరా అనుకొన్నా. వేలు విడిచిన అన్నదమ్ములిద్దరూ పొట్లాడుకుంటున్నారన్న వార్త యీ కుటుంబంలో పాకిపోయింది ఊహాగానాలు బయలుదేరాయి. మీసాలు తిప్పుకున్నారు. తొడలు చరుచుకున్నారు. బలాబలాలు పరీక్షిస్తామన్నారు దీనికంతకూ కారకురాలు వనజాక్షి అని స్వంత తమ్ముడే అంటే తమ్మారావు లెంపలు వాయించాడు. దానితో వనజాక్షి యెంత ప్రయత్నించినా లాభం లేక పోయింది. అన్నదమ్ములు విడిపోయారు.

వనజాక్షి కళ్లల్లో నీరు కారకపోయినా ఆమె బాధ తెలుసుకున్న భర్త 'వెధవలు—దొంగవెధవలు— నీచులు—వాళ్ల మధ్యను ఉండొద్దు నువ్వు...'

ఆమెక్కడేమీ తెలీదు అంతా తెలుసు—నన్నట్లే మౌనంగా పూరుకుంది. అతని ఆవేశం యింకా తగ్గలేదు

'ఒక ఆడది ముఖం ముడచకుండా మాటాడితే వీళ్లకు అర్థం అయ్యేది — రంకు! వీళ్లకింద యింత చేశామే—పోనీ నా ముఖమ్మైనా చూడొద్దా? నా పెళ్లాం సత్తువ నాకు తెలుసు—ఈ వెధవలందరికీ యేం తెలుసు?'

వనజాక్షి మళ్లీ అలా మౌనంగానే చూసింది.

'ఆ వెధవ మరదో అని నిండుగా పిల్చేదానవు అగ్గిలాంటి, నీ మీద నాతో చెప్తాడా? దొంగవెధవ. అక్కడే వాడి పీక తెగేద్దును. నీతో కాపరం చేసే భాగ్యం పోతుందని ఆగాను'

ఈ కోపాలూ తాపాలూ రాజకీయాల్లోకి పాకిపోయాయి. అతను మొదట రాజకీయాల్లో పాల్గొనడానికి దేనికి సంశయించాడో అదేజరిగింది. తమ్మారావు అన్నీ పెళ్లాంతో చెప్పుకుంటున్నాడు. ఆమె మౌనంగా వింటోంది. అలా వినటం వలన అతనికెంతో వుత్సాహంగా వుంది. ఎంతో గుండెనిబ్బరం. ఆమె మూగబోయింది. అసలు జరిగిన విషయం చెప్పలేదు. అది చెప్తే వాళ్లిద్దరూ విడిపోతారు. ఒకరినొకరు రోషాలతో, కత్తులతో పొడుచుకుంటారని చెప్పలేదు. దీని వల్ల నిజం భర్తకు కూడా చెప్పలేకపోయింది. లోకానికి యెలా చెప్పగలుగుతుంది? చెప్పినా లోకం నమ్ముతుందా?

# వనజాక్షి...

ఆడది అగ్గిలా వున్నా, ఆర్పగలిగే మొగాళ్లుంటారని ఆమె యిప్పుడే తెలుసుకుంది. కామపు మంటలు, నివురుగప్పి నిప్పులాంటి ఆడదాని శీలాన్ని మింగేయగలవని ఆమె కిప్పుడే తోచింది.

ఆమె మౌనానికి కారణం—ఆమె అసలు సత్యాన్ని దాచి మగడి దగ్గర రెండు ఆకారాలతో బ్రతుకుతున్నానన్న బాధే. ఒక పచ్చని అడవిలో కారుచిచ్చు రగుల్కొన్నట్లుంది. చెట్లు, వేళ్లు పాతుకపోయినట్లు; ఆడదానికి శీలం పాతుకపోయినా చెట్లును పీకే గాలి వానలు, మొరుడుచేసే పిడుగులూ పడుతుంటాయని యిప్పుడే ఆమె తెలుసుకుంది.

రాజకీయ తమాషాలు రంగస్థలమెక్కాయి. ప్రేక్షకులు విరగబడి చూస్తున్నారు. రెండుపార్టీలు రచ్చకు దిగారు. చంగయ్య పార్టీకి పులిబ్బుర్ర, నక్కగుండె వుంది. ఎప్పుడైతే మునిసిపల్ కౌన్సిల్‌లో ఛైర్మన్ ఓట్లతో దించలేక పోయారో రోడ్లమీద పడ్డారు. చంగయ్య గూండాలను దిగుమతి చేసాడు, హోర్తాళ్ చేశాడు కొట్లు ముయ్యించాడు రోడ్లపై అడ్డంకులు కలంపోట్లు బదులు కత్తిపోట్లకు నెట్టుకున్నాడు. పోలీసులు తుపాకులు పేల్చవలసి వచ్చింది. బోర విరుచుకుని ముందుకు వెళ్లాడు. చంగయ్య నిజంగా లీడరైపోయాడు. ప్రజలు అతని మీద భక్తితో కాదు, భయంతో అతనికి 'జై' అంటున్నారు. లోలోపల వాళ్లకున్న అసహ్యం బయటకు కక్కే గుండెధైర్యం లేని పిట్టలు. ఆలోచించి నడచుకోలేని మట్టి ముద్దలు వీళ్లు. యింకో మనిషిలో అమరత్వాన్ని ఎలా అర్థం చేసుకోగలరు?

ఈ తమాషాలో, యీ పశువుల కుమ్ములాటలో — ఒక అమాయకురాలైన ఆడదాని శీలం, అడ్డకోడానికి దొరికింది. ఏ గోడలమీద చూసినా, వనజాక్షి చంగయ్యల బొమ్మలూ, బూతులూ, తమ్మారావుని ఒక నపుంసకుడిగా చూపించి, ఆమె చంగయ్యతో కామవ్యాపారాలు జరుపుతున్నట్లు రంగురంగు బొమ్మలు. బూతు బొమ్మలు — వివిధ బూతు కవిత్వంతో శూరంతా గోడలు, ఖాళీలేకండా రాసారు. వాళ్ల తల్లీ, అక్కచెల్లెలు యెవరూ లేనట్లే. వాళ్లెవరూ యే మగాడి చెంతా చేరకుండా వాళ్లను కన్నట్లు రాసారు. మనుషులకూ, కుక్కలకూ భేదం లేనట్లు— మానవాళినే కుక్కలు చేసిన మానవ శునకాలు, పట్నం వాసులంతా కుక్కలనే భ్రాంతిని లేవదీశారు వాళ్లే. మనుషులయ్యుంటే యీ పోరాటాలను చూచి పూరుకుంటారా? అలా చేసిన వాళ్లపై యెందుకు తిరగబడలేదు? దానికి ఒక కారణమే అగుపిస్తోంది— ఆలనాడు నిండు సభలో ద్రౌపదీ వస్త్రాపహరణం చేసేటప్పుడు భీష్ముడు, ద్రోణుడులాంటి మహానుభావులే పూరుకున్నప్పుడు మనం యెందుకు పూరుకుని అంత గొప్పవాళ్లం కాకూడదనుకున్నారేమో?

అసలు జరిగిన సంగతి వనజాక్షి భర్తతో చెప్పలేకపోయింది. తన చనువును తన కామవికారానికి వుపయోగించుకోలేని చంగయ్య లీడరై కూర్చుండటం ఆమె సహించలేకపోయింది కళ్లతో ఆ బూతు బొమ్మలను చూడలేకపోయింది. అంత ధైర్యమైన ఆడది మగడ్ని తప్పించి యింకెవర్నీ ప్రేమించలేకపోయింది; ఈనాడు ఆడదాని శీలాన్ని రక్షించగలిగే ఆపద్బాంధవులు, ఈ పుణ్యభూమిలో ఎవరూ లేరని ఆ యిల్లాలికి తెలుసు. అందుకే ఆత్మహత్య చేసుకుంది. మగడికి వదలిన ఉత్తరంలో యిలా వుంది.

'నేనింత పిరికిదాన్నని నాపై జాలి పడ్తారు మీరు ఆడదాని శీలంతో చెలగాట మాడే ఈ మనుషుల మధ్య యింకొక్క నిముషం వుండటానికి రోత పుట్టింది. క్షమించండి.'

నిజం బయటపడిందని బలవంతాన చచ్చిందని యెవరో ఒక గోడమీద రాసారు. ఆ సమయానికి ఆమె ముఖం ప్రాణం లేకపోయినా హుందాగా వుంది. నిర్మలంగా వుంది. నిజంగా చిన్న నగవు కనిపిస్తోంది.

ఆలనాడు ద్రౌపది వస్త్రాపహరణం, ఒక మహాభారత సంగ్రామానికి దారితీసింది. ఈనాడు వనజాక్షి వస్త్రాపహరణం దేనికి దారితీస్తోందో చూద్దాం! ●